## ఇంటికి చేరుకున్న కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

సిబ్బందికి కేసీఆర్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తనకోసం దవాఖానకు వచ్చిన అభిమానులు, నాయకులకు అభివాదం చేశారు. హాస్పిటల్‌నుంచి నేరుగా బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసానికి చేరుకొన్నారు. కేసీఆర్ ఇంటికి వస్తున్నారని తెలిసిన స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడ గుమిగూడారు. గులాబీ అధినేతను చూసేందుకు నందినగర్ కిటకిటలాడింది. ఇంటి ముందు కేసీఆర్‌కు సంప్రదాయ పద్ధతిలో దిష్టితీసి, హారతి పట్టి స్వాగతం పలికారు. కేసీఆర్ ఇంట్లోకి చేరగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఆమె భర్త అనిల్ వేద పండితులచే ఆశీర్వచనాలు ఇప్పించారు. దవాఖాన వద్ద ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, బాల్క సుమన్, జీవన్‌రెడ్డి తదితరులు కేసీఆర్‌ను పరామర్శించారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ తదితరులు వెంట ఉన్నారు.



యశోద దవాఖాన నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దిష్టితీస్తున్న వ్యక్తిగత సిబ్బంది

## కేసీఆర్‌కు 4+4 భద్రత!

- **వై క్యాటగిరీకే మొగ్గుచూపిన కాంగ్రెస్ ప్రభుత్వం**

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు పదేండ్లపాటు ముఖ్యమంత్రిగా సేవలందించిన కేసీఆర్‌కు 4+4 భద్రతను కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. యశోద దవాఖాన నుంచి శుక్రవారం డిశ్చార్జి అయిన బీఆర్ఎస్ అధినేత నందినగర్‌లోని తన ఇంటికి చేరుకున్న వెంటనే ప్రభుత్వం భద్రతను ఉపసంహరించింది. వై క్యాటగిరి భద్రత కల్పించింది. ఇందులో భాగంగా కేసీఆర్‌కు 4+4 భద్రత లభిస్తుంది. అంటే ఆయన వెంట నిత్యం నలుగురు సిబ్బంది విధుల్లో ఉంటారు. వారి విధులు ముగిసిన తర్వాత మరో నలుగురు వచ్చి చేరుతారు. ఇంటి ముందు ఓ హెడ్‌కానిస్టేబుల్‌తో సెంట్రీ విధులు, మరో హెడ్‌కానిస్టేబుల్‌తో పహారా ఉంటుంది. అవసరమైతే సెక్యూరిటీ కమెండోలను కూడా కేటాయించాలి. భద్రతా అవసరాల దృష్ట్యా ఓ ఎస్‌ఐ ర్యాంకు అధికారి కూడా ఉంటారు. కేసీఆర్‌కు థ్రెట్ పర్సప్షన్ రేట్ తక్కువగా ఉందని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. తెలంగాణకు పదేండ్లపాటు సీఎంగా పనిచేసిన వ్యక్తికి ప్రభుత్వం కనీసం వైప్లస్ క్యాటగిరీ భద్రతనైనా కేటాయిస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు భావించాయి. ప్రభుత్వం మాత్రం వై క్యాటగిరీ భద్రతకే మొగ్గుచూపడం గమనార్హం.

### లోకం పోకడ





డోంట్‌వర్రీ సార్.. షిఫ్టుల ప్రకారం సర్దుకుంటాం.. మేం పొద్దున బయటకెళ్లి రాత్రి వస్తాం..!

# పంచాయతీ ఎన్నికలపై సందిగ్ధత!

- ఇంకా ఖరారు కానీ బీసీ రిజర్వేషన్
- సర్కారుకు నివేదిక ఇవ్వని బీసీ కమిషన్
- బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్పష్టీకరణ
- అది జరగాలంటే కులగణన తప్పనిసరి
- దానికి కనీసం 4 నెలలు పట్టే అవకాశం

కరీంనగర్/హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరిలోగా జరగాల్సిన సర్పంచ్ ఎన్నికలపై సందిగ్ధం నెలకొన్నది. బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు కేటాయించాలని గతంలోనే సుప్రీం కోర్టు తీర్పు నిచ్చింది. ఈ విషయంపై వివిధ రాష్ట్రాల్లో తెలంగాణ బీసీ కమిషన్ అధ్యయనం నిర్వహించింది. కానీ ఇంకా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సర్పంచ్ ఎన్నికలు జరగాలంటే బీసీ కమిషన్ నివేదిక తప్పనిసరి. అలాగే, కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ ప్రకారం చూసినా.. ఇప్పట్లో సర్పంచ్ ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో ఉన్న బీసీ రిజర్వేసన్ 23 శాతం నుంచి 42 శాతానికి పెంచి సంబంధిత వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచుతామని ఆ పార్టీ స్పష్టమైన హామీ ఇచ్చింది. అది జరగాలంటే.. బీసీ కులగణన అయినా చేయాలి? లేదా ఓటర్ల ఆధారంగా కులగణన చేస్తే తప్ప సర్పంచ్ ఎన్నికలు సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొన్నది. పంచాయతీ ఎన్నికలను 2019 జనవరిలో వివిధ దశల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం 2024 ఫిబ్రవరి ఒకటితో ప్రస్తుత సర్పంచులతోపాటు పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(3)(ఏ) ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేండ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది.



### ఎన్నికల నిర్వహణపై అనుమానమే!

2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలోనూ సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని చెప్పింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లను అప్పటి పంచాయతీ రాజ్ అధికారులు ఖరారు చేశారు. అప్పుడు బీసీలకు 22.79 శాతం, ఎస్సీలకు 20.53 శాతం, ఎస్టీలకు 6.68 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. అయితే చాలా రాష్ట్రాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇచ్చారు. దీనిపై సుప్రీం కోర్టు ట్రిపుల్ టీ ఆదేశాలిచ్చింది. దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రతి రాష్ట్రంలోనూ డెడికేటెడ్ కమిషన్ (మన రాష్ట్రంలో బీసీ కమిషన్) నియమించాలి. సదరు కమిషన్ పూర్తి అధ్యయనం చేసి ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు ఇవ్వాలి. కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని వర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించొద్దు. ఈ ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర బీసీ కమిషన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ కమిషన్ కర్ణాటక, మధ్యప్రదేశ్, తమిళనాడులో పర్యటించి స్థానిక సంస్థల రిజర్వేషన్లను అధ్యయనం చేసింది. కొన్ని రాష్ట్రాల్లో బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు అమలు చేశారు. మరి కొన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితా ఆధారంగా బీసీల సంఖ్యను గుర్తించి రిజర్వేషన్లు కల్పించారు. కమిషన్ ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించింది. ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలంటే.. ఇంటింటా తిరిగి కులగణన చేయాలి. ఇలా చేయాలంటే కనీసం రెండు మూడు నెలలైనా పడుతుంది. లేదా ఓటరు జాబితా ఆధారంగా కులగణన చేయాల్సి ఉంటుంది. కులగణన కన్నా ఓటర్ జాబితా ఆధారంగా చేయడానికి కొంత సమయం తక్కువ పడుతుంది. రెండు పద్ధతుల్లో ఏదో ఒక దానికి ప్రభుత్వం ఆమోద ముద్రవేయాల్సి ఉంటుంది. అలా చేసిన తర్వాత సదరు గణాంకాలను బీసీ కమిషన్ ప్రభుత్వానికి నివేదిస్తుంది. వాటి ప్రాతిపదికగా మాత్రమే బీసీ రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### సిద్ధంగా ఉండాలని ఆదేశాలు

పంచాయతీ ఎన్నికలొప్పుడొచ్చినా సమర్థవంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని ఎస్ఈసీ ఇటీవలే ఆదేశించింది. వచ్చే ఫిబ్రవరి ఒకటితో పంచాయతీ పాలకవర్గాల గడువు పూర్తవుతున్న నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని ఎస్ఈసీ ఈ నెల 4న అన్ని జిల్లా కలెక్టర్లకు (లెటర్ నంబర్ 921/టీఎస్ఇసీ-పీఆర్/2023) ఆదేశాలు జారీచేసింది. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో..? వారికి తగ్గట్టుగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలో నిర్దేశిస్తూ, స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందిని నియమించడంతోపాటు పంచాయతీ ఎన్నికల కోసం సదరు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించింది.

### 42 శాతానికి పెంచుతాం: కాంగ్రెస్

సర్పంచ్ ఎన్నికలు జరగాలంటే మరో ట్విస్టు ఉన్నది. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో భాగంగా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దాని ప్రకారం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చింది. కొత్త స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని పేర్కొన్నది. తద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పడమేకాకుండా.. బీసీ ఉపకులాలవారీగా వర్గీకరణ చేసి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పింది. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాన్ని నిశితంగా పరిశీలిస్తే.. కులగణన జరగాల్సిన అవసరం ఉన్నది. అది ఇంటింటా కులగణన చేస్తారా? లేదా ఓటరు జాబితా ఆధారంగా చేస్తారా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాల్సి ఉన్నది. ఏరకంగా చూసినా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు తేలాలంటే.. కులగణన తప్పనిసరిగా జరగాల్సిందే. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే కనీసం నాలుగు నెలలైనా పడుతుందని నిపుణులు చెప్తున్నారు. ఏప్రిల్‌లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం ఇప్పటికే అధికార యంత్రాంగం పనులు మొదలుపెట్టింది. ఈ పరిస్థితుల్లో బీసీ కులగనన జరుగుతుందా? లేదా? అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## విద్యుత్తు సంస్థల సీఎండీలుగా బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యుత్తు సంస్థల సీఎండీలుగా ఐఏఎస్ అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ (ఎఫ్ఏసీ)గా సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ విద్యుత్తు సౌధలో బాధ్యతలు స్వీకరించారు. ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ)గా ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ ఝా బాధ్యతలు స్వీకరించారు. దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీగా ముషారఫ్ ఫారూఖీ మింట్ కాంపౌండ్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో, వరంగల్‌లోని ఉత్తర ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) కార్యాలయంలో సీఎండీగా వరుణ్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు.

### చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 9.4°c | 32.8°c |
| ఆదిలాబాద్ | 9.7°c | 32.8°c |
| మెదక్ | 12.0°c | 31.8°c |
| నిజామాబాద్ | 16.0°c | 29.7 °c |
| హైదరాబాద్ | 17.0°c | 27.0°c |
| కరీంనగర్ | 17.0°c | 28.0°c |
| మహబూబ్‌నగర్ | 17.2°c | 28.6°c |
| వరంగల్ | 18.0°c | 28.0°c |
| నల్లగొండ | 18.0°c | 32.3°c |
| ఖమ్మం | 19.0°c | 30.0°c |

## లోక్‌సభ ఎన్నికలు ఫిబ్రవరిలోనే?

మొదటిపేజీ తరువాయి...

అసెంబ్లీ ఎన్నికల్లో దక్షిణాదిలోని తెలంగాణ మినహా ఉత్తరాదిలోని రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ అనూహ్య ఫలితాలు సాధించింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోయింది. బీజేపీ పట్ల సానుకూల పవనాలు వీస్తున్న ప్రస్తుత తరుణంలోనే లోక్‌సభ ఎన్నికలను కూడా ముగించాలని కేంద్రం యోచిస్తున్నట్టు సమాచారం. గడువు ప్రకారం ఏప్రిల్-మే వరకు ఆగితే.. ఇప్పటి ఊపు తగ్గే ప్రమాదం ఉంటుందని బీజేపీ అధినాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఇండియా కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలబడటం లోక్‌సభ ఎన్నికల్లో తమకు కలిసి వస్తుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఇండియా కూటమిలో లుకలుకలు సైతం తమకు కలిసి వస్తాయని భావిస్తున్నట్టు తెలిసింది. మధ్యప్రదేశ్‌లో సీట్ల పంపకాల విషయంలో కాంగ్రెస్- సమాజ్‌వాదీపార్టీకి మధ్య విభేదాలు తలెత్తాయి. కాంగ్రెస్ ఒంటెత్తు పోకడల పట్ల ఇండియా కూటమిలోని మిగతా పార్టీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. ఇప్పటికే కేరళలో సీపీఎంతో, ఢిల్లీ, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీతో కాంగ్రెస్‌కు పొసగడం లేదు. కూటమి ఏర్పాటుకు కృషి చేసిన బీహార్ సీఎం నితీశ్‌కుమార్ ఈ మధ్య అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ కూటమి మళ్లీ ఐక్యతా రాగం వినిపించకముందే ఆయా పార్టీలను ఎన్నికల రంగంలోకి దించాలన్నది బీజేపీ వ్యూహంగా ఉన్నట్టు తెలుస్తున్నది.

### ఫిబ్రవరిలోనే షెడ్యూల్: హింట్ ఇచ్చిన ఏపీ సీఎం జగన్

'గతంలో కంటే ఈ సారి 20 రోజుల ముందుగానే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావొచ్చు' అని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి హింట్ ఇవ్వడంతో ముందస్తు ఎన్నికలపై జరుగుతున్న ప్రచారానికి మరింత బలం చేకూరింది. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు జగన్ వ్యాఖ్యానించారు. అన్ని కార్యక్రమాలు ఫిబ్రవరి మొదటి వారంలోగా పూర్తి చేయాలని మంత్రులను ఆదేశించారు. కేంద్రంలోని బీజేపీతో జగన్‌కు ఉన్న సత్సంబంధాలరీత్యా సార్వత్రిక ఎన్నికల ముందస్తుపై ఆయనకు కచ్చితమైన సమాచారం ఉండే ఉంటుందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఏపీ క్యాబినెట్ సమావేశంలో 46 కీలక అంశాలపై చర్చించారు. సామాజిక పెన్షన్‌ను రూ.2,750 నుంచి 3 వేలకు పెంచడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకొన్నది. ఈ పెంపు ఈ నెల 18 నుంచి అమలులోకి తీసుకురావాలని, ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకున్న రోగులకు మందులను డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించింది.

## కరీంనగర్ కమలంలో కొట్లాట!

- బండి సంజయ్ వర్సెస్ సీనియర్ నేతలు
- పార్లమెంటు సీటుపై రాజుకున్న అగ్గి
- కరీంనగర్ సీటుపై మురళీధర్‌రావు ఆసక్తి
- నేడు పార్టీ నేతలతో బండి సమావేశం
- అధిష్ఠానం నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

కరీంనగర్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణప్రతినిధి): తెలంగాణ బీజేపీలో ముసలం మొదలైంది. సీనియర్ నాయకులకు, నిన్నమొన్నటి వరకు పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన బండి సంజయ్‌కు మధ్య ఏమాత్రం పొసగడం లేదు. ఒకరిపై ఒకరు పట్టుసాధించే ప్రయత్నంలో పోరు తీవ్రతరమైంది. బండికి కరీంనగర్ టికెట్ ఇస్తే ఊరుకునేది లేదంటూ సీనియర్లు తీర్మానం చేసిన 48 గంటలు కూడా కాకముందే.. శనివారం పార్లమెంటు ఎన్నికలకు సమాయత్తమయ్యేందుకు బండి సమావేశం నిర్వహిస్తుండడం పార్టీలో అగ్గి మరింత రాజేసింది. పార్టీ మధ్యప్రదేశ్ ఇంచార్జి మురళీధర్‌రావు కరీంనగర్ లోక్‌సభ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలతో కరీంనగర్ రాజకీయం రసవత్తరంగా మారింది.

### గతంలో రహస్యం.. ఇప్పుడు బహిరంగం

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అయిన బండి సంజయ్‌కు వ్యతిరేకంగా గతంలోనూ ఒకటి రెండు సార్లు సీనియర్లు సమావేశమైనప్పటికీ, ఈసారి మాత్రం బహిరంగంగానే తిరుగుబాటు చేస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ సీనియర్లు పలువురు పాల్గొన్నారు. బండి ఒంటెత్తు పోకడలు వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోతున్నదని తీవ్ర విమర్శలు చేశారు. సీనియర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, వ్యతిరేకిస్తే కక్ష పెంచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల పేరిట అక్రమాలకు కూడా పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయనకు పలుమార్లు అవకాశం ఇచ్చారని, ఈసారి కొత్తవారికి ఇవ్వాలని సమావేశంలో అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోపాటు ఈటల రాజేందర్, లక్ష్మణ్ వంటి నాయకులపై అసత్య ప్రచారం చేస్తున్నారని కూడా ఆరోపించారు.

### తగ్గేదే లేదంటున్న బండి

తనకు వ్యతిరేకంగా సీనియర్లు సమావేశమైన విషయం తెలుసుకున్న బండి సంజయ్ పార్టీపై పట్టు కోసం మరిన్ని ప్రయత్నాలు ప్రారంభించారు. సీనియర్లకు చెంపపెట్టులా శనివారం కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులతో సమావేశం అవుతున్నట్టు తెలుస్తున్నది. ఈ నెలాఖరులోగా 20 వేలమంది పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సీనియర్లు సహకరించినా, లేకున్నా తన వైఖరిలో మార్పు ఉండదని చెప్పడంతోపాటు తానే మళ్లీ బరిలోకి దిగుతున్నట్టు సంకేతాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఎటువైపు ఉంటుందన్న ఆసక్తి సర్వత్రా నెలకొన్నది.

### నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

**ఎన్‌పీసీఐఎల్ లో...**

**న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 53
- పోస్టులు: సూపరింటెండెంట్ ట్రెయినీ/టెక్నీషియన్, సైంటిఫిక్ అసిస్టెంట్, గ్రేడ్-1 అసిస్టెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 5
- వెబ్‌సైట్: www.npcilcareers.co.in

**సీసీఎంబీలో...**

**సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 69
- పోస్టులు: జూనియర్ స్టెనోగ్రాఫర్, టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్, టెక్నికల్ ఆఫీసర్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్/మెడికల్ ఆఫీసర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 20, స్టెనో పోస్టులకు జనవరి 29
- వెబ్‌సైట్: www.ccmb.res.in

**యునైటెడ్ ఇండియాలో..**

**యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 300 (తెలంగాణ-3, ఏపీ-8)
- పోస్టులు: అసిస్టెంట్స్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 6
- వెబ్‌సైట్: https://uiic.co.in

**ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్**

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, హిస్టరీ (డీఎస్సీ, గ్రూప్స్) ఫిజిక్స్ (ఐఐటీ-నీట్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

## ఫార్మాసిటీ రద్దు నిర్ణయం దారుణం

- **కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్**



మెట్‌పల్లి, డిసెంబర్ 15 : ఫార్మాసిటీని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలని నిర్ణయించడం దారుణమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాలుష్యరహిత ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయిస్తే మెజార్టీ రైతులు భూములు ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రజాభీష్టం మేరకే ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని అప్పటి ప్రభుత్వం స్పష్టం చేసిందని, కానీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేయాలనుకోవడం సరికాదని 'ఎక్స్' వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ ద్వారా తెలంగాణ ప్రజలకు ప్రత్యక్షంగా 5 లక్షలు, పరోక్షంగా 10 లక్షల ఉద్యోగా అవకాశాలు వచ్చేవని, ఈ ప్రాజెక్ట్ కేసీఆర్ మానసపుత్రికగా ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే యావత్ ప్రజానీకం హర్షిస్తుందని తెలిపారు.

## నిర్మాణ రంగంలో హరిత విప్లవం!

- ఆరోగ్యం, ఆహ్లాదానికి నగర జీవుల ప్రాధాన్యం
- వర్టికల్ గార్డెన్ కాన్సెప్ట్‌తో భారీ భవన నిర్మాణాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ): కాంక్రీట్ జంగిల్‌లా మారిన గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజలు ఇప్పుడు హరిత భవనాల వైపు చూస్తున్నారు. ఆరోగ్యంతోపాటు ఆహ్లాదానికి పెద్దపీట వేస్తూ హరిత భవనాల్లో కలల గృహాన్ని సొంతం చేసుకుంటున్నారు. ఇలాంటివారిని వర్టికల్ గార్డెన్ కాన్సెప్ట్‌లు బాగా ఆకర్షిస్తున్నాయి. దీంతో ఇప్పటికే పలువురు బిల్డర్లు సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్‌తోపాటు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ కిస్మత్‌పుర, తెల్లాపూర్, కోకాపేట, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో వర్టికల్ గార్డెన్ నిర్మాణాలకు రియల్టర్లు శ్రీకారం చుట్టారు. తాజాగా కొండాపూర్‌లో '360 లైఫ్' పేరిట ఓ బిల్డర్ వర్టికల్ గార్డెన్ కాన్సెప్ట్‌తో 19 అంతస్తుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. పర్యావరణాన్ని సమతుల్యం చేయడం, కర్బన ఉద్గారాలను తగ్గించడం, గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించడం సవాల్‌గా మారిన ప్రస్తుత తరుణంలో అటవీ ప్రాంతాన్ని తలపించేలా భవన నిర్మాణాలు జరగడం శుభపరిణామమని పర్యావరణ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణంతో జీవన ప్రమాణాల పెంపునకు దోహదపడటంతోపాటు ఎన్నో దీర్ఘకాలిక ప్రయోజనాలను చేకూర్చే వర్టికల్ గార్డెన్ నిర్మాణాలకు మున్ముందు మరింత ఆదరణ లభిస్తుందని రియల్టర్లు చెప్తున్నారు. కార్పొరేట్ కంపెనీలు సైతం హరిత భవనాలకు ప్రాధాన్యమిస్తుండటంతో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్‌లో ఇప్పటికే దాదాపు 25 ప్రాజెక్టులు నమోదయ్యాయి.



### గ్రీన్ బిల్డింగ్స్‌తో లాభాలు

పర్యావరణ పరిరక్షణకు, జీవన ప్రమాణాల పెంపునకు గ్రీన్ బిల్డింగ్స్ ఎంతో దోహదపడతాయి. ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం వల్ల ఎప్పుడూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. పచ్చదనంతో మానసిక, శారీరక సమస్యలు దరిచేరవు. మొక్కల నుంచి వెలువడే ఆక్సిజన్‌తో వాయు నాణ్యత పెరుగుతుంది. స్వచ్ఛమైన గాలి, సూర్యకాంతి లభిస్తాయి. విండ్ ఎనర్జీ, సోలార్ పవర్, వాటర్ హార్వెస్టింగ్‌తో విద్యుత్తు, నీటి బిల్లులు తగ్గుతాయి.

## మనిషి కంటే తెలివైన పావురాలు!

- శిక్షణ ఇస్తే ఏ విషయాన్నైనా నేర్చుకోగలవు
- ఏఐలా బ్రూట్‌ఫోర్స్‌తో సమస్య పరిష్కారం
- శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): పక్షులలో పావురాలు తెలివైనవని మన పూర్వీకులు ఎప్పుడో గుర్తించారు. వందల ఏండ్ల క్రితమే సమాచార చేరవేతకు ఉపయోగించేవారు. కానీ, ఇవి మనం ఊహించినదానికంటే చాలా తెలివైనవని, శిక్షణ ఇస్తే ఏ విషయాన్నైనా నేర్చుకోగలవని శాస్త్రవేత్తలు తేల్చారు. కృత్రిమ మేధస్సు (ఏఐ)లా పావురాలు కూడా కొన్ని సమస్యలను పరిష్కరించగలవని కొలంబస్ ఒహియో స్టేట్ వర్సిటీ పరిశోధకులు గుర్తించారు. సమస్యా పరిష్కారానికి ఏఐలో ఉపయోగించే 'బ్రూట్ ఫోర్స్' పద్ధతిని పావురాలు పాటిస్తున్నాయని, కృత్రిమ మేధస్సుతో పనిచేసే కంప్యూటర్, పావురం రెండూ ఒకే రకమైన పద్ధతిలో నేర్చుకుంటాయని తమ అధ్యయనంలో తేలిందని వెల్లడించారు. 4 రకాల పావురాలను ఎంపికచేసి కొన్ని టాస్క్‌లను ఇవ్వడంతోపాటు ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో వేర్వేరు పరీక్షలు నిర్వహించడంతో అవి త్వరగా ఆయా పనులను నేర్చుకుని టార్గెట్‌ను చేరుకున్నాయని, లెక్కించడం నుంచి రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడం వరకు పావురాలు పలు రకాల పనులు చేయగలవని వివరించారు. ప్రత్యేకించి కొన్ని విషయాలను మనిషి కంటే సమర్థంగా నేర్చుకోగలిగాయని, అవి నేర్చుకునే విధానం కృత్రిమ మేధస్సును పోలి ఉన్నదని పేర్కొన్నారు.

## మృతుడు మడావి కాదు మడ్కం హిడ్మా

- **మధ్యప్రదేశ్ పోలీసుల ధ్రువీకరణ**

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు.. కేంద్ర కమిటీలో కీలక సభ్యుడు మడావి హిడ్మా చనిపోయినట్టు వస్తున్న వార్త నిజం కాదని, తెలంగాణ, మధ్యప్రదేశ్ పోలీసులు శుక్రవారం ధ్రువీకరించారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ ప్రాంతానికి చెందిన మడ్కం హిడ్మా అలియాస్ చైతూ అని మధ్యప్రదేశ్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. అతనిపై మధ్యప్రదేశ్‌లో రూ.3 లక్షలు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.5లక్షలు, మహారాష్ట్రలో రూ.6 లక్షల రివార్డు ఉన్నట్టు పేర్కొన్నారు.

పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చీఫ్‌గా ఉన్న మడావి హిడ్మా.. వ్యూహరచనే విభిన్నంగా ఉంటుంది. ప్రతి ఎన్‌కౌంటర్‌లోనూ తాను చనిపోయినట్టు మీడియాకు లీకులు ఇవ్వడం.. ఆ తర్వాత పోలీసులతో ప్రకటన ఇప్పించుకోవడం హిడ్మా ప్రత్యేకత. హిడ్మా స్కెచ్ వేస్తే.. భద్రతా దళాలల్లో జరిగే నష్టం ఎక్కువగా ఉంటుందనేది పోలీసులకు సైతం తెలిసిన నిజం. తన వ్యూహాల వల్లే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడని అంటుంటారు. సాధారణంగా ఈ కమిటీలో తెలుగు రాష్ట్రాలు వారు అధికంగా ఉంటే.. సుక్మా నుంచి ఈ స్థానం దక్కించుకున్న వ్యక్తి హిడ్మా అని తెలుస్తున్నది.